క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామికి ప్రియమైన రోజు కావడంతో భూదేవి, అలివేలిమంగమ్మ సమేత శ్రీ కోనా వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించారు. గ్రామస్తులు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కేసీ కింద వరి సాగు చేయొద్దు

గడివేముల: వర్షాభావ పరిస్థితుల వల్ల మండల పరిధిలో కేసీ కెనాల్ కింద వరిపంటను సాగు చేయవద్దని ఏఓ హేమసుందర్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల వ్యవసాయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండనందున కేసీ కెనాల్‌కు పూర్తి స్థాయిలో నీటి విడుదల చేయలేదన్నారు. కేసీ కింద ఆరుతడి పంటలైన జొన్న, మొక్కజొన్న, మినుములు, సోయాబీన్ వంటి స్వల్పకాలిక పంటలు వేసుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలన్నారు. కొత్తగా పాసు పుస్తకాలు వచ్చిన రైతులు స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేసుకుంటే పెట్టుబడి సాయం అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమి పూజ

కల్లూరు: 35వ వార్డు పరిధిలోని శివప్ప నగర్‌లో ఈశ్వర ఆంజనేయ స్వామి దేవాలయం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శనివారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మాధురి, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరయ్య, మిద్దూరు శ్రీనివాసులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సి.బెళగల్: మండలం పరిధిలోని పలు గ్రామాలలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సుకుమార్ తెలిపారు. మండలంలోని 33/11 పోలకల్ సబ్ స్టేషన్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో భా గంగా ఆదివారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ను నిలిపి వేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో 33/11 పోలకల్, గుండ్రేవుల సబ్ స్టేషన్ల పరిధిలో పోలకల్, ముడుమాల, గుండ్రేవుల, పల్‌దొడ్డి, కొండాపురం, తిమ్మందొడ్డి, సంగాల తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

పాణ్యం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ ఎంఆర్‌పీఎస్ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగోరోజుకు చేరుకున్నాయి. శనివారం ఆ సంఘం రాష్ట్ర నాయకులు గద్దల సామేల్ మాట్లాడుతూ ఇకనైన ప్రభుత్వాలు చొరవ తీసుకొని పార్లమెంటులో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. వర్గీకరణతోనే మాదిగల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ బాబు, మండల అధ్యక్షుడు తిమ్మయ్య, చంద్రబాబు, నాగర్జున పాల్గొన్నారు.

కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో 1.20 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు శనివారం డ్యాం అధికారులు తెలిపారు. కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇన్ ఫ్లో నిలిచిపోయిందని, దిగువకు నీటి విడుదల నిలిపేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

కల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందనుందని కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, నాయకులు శివరాం స్వామి, ఆరోగ్య కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు గ్రామ సచివాలయం ప్రారంభం

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరు ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం-2ను ఆదివారం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలి

కోడుమూరు రూరల్: మండలంలోని అమడగుంట్ల హైస్కూల్‌లో బాలికల టాయిలెట్స్ వద్ద అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఎర్రదొడ్డి శివ, అమడగుంట్ల అజయ్ అనే ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని హెచ్ఎం శ్రీనివాస్‌యాదవ్ కోడుమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఇద్దరు శనివారం మధ్యాహ్నం మద్యం తాగి బాలికల టాయిలెట్స్ వద్ద ఉండగా ఉపాధ్యాయులు పట్టుకుని పోలీసులకు సమాచారమందించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్ఎం శ్రీనివాస్‌యాదవ్ పోలీసులను కోరారు.


మట్టి గణపతి తయారు చేస్తున్న బాలికలు



సి.బెళగల్ జెడ్పీ హై స్కూల్లో మట్టి గణపతికి పసుపు, కుంకుమతో అలంకరిస్తున్న విద్యార్థినులు

మట్టి గణేష్‌కు జై కొట్టండి

వినాయక చవితి పండుగ వచ్చేస్తోంది. ఊరూరా గణనాథులు కొలువుదీరి పూజలు అందుకోనున్నారు. అయితే, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాల ఏర్పాటుతో పర్యావరణం దెబ్బతింటోంది. ప్రకృతి ప్రేమికుడు అయిన గణనాయకుడిని సులువుగా.. అదే ప్రకృతిలో కలిసిపోయేలా తయారు చేసి పూజిస్తే విఘ్నాలు తొలగి శుభాలు కలుగుతాయంటున్నారు సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. శనివారం వారు ఇన్‌చార్జ్ హెచ్ఎం మల్లయ్య అధ్యక్షతన ఎన్‌జీసీ క్లస్టర్ కో ఆర్డినేటర్ (జీవ శాస్త్రం) టీచర్ సుంకన్న ఆధ్వర్యంలో సైన్స్ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో తమ చిట్టి చేతులతో దాదాపు 50 మట్టి విఘ్నేశ్వరులను తయారు చేశారు. వాటికి తమ ఇళ్లలో ఉన్న కుంకుమ, పసుపు, ఇతర రంగులతో ఎంతో చక్కగా అలంకరించి ప్రదర్శించారు. వీటిని గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. మట్టి వినాయకుల తయారీ ద్వారా పర్యావరణ ప్రాధాన్యతను చాటారని పలువురు వారిని మెచ్చుకున్నారు.

–సి.బెళగల్


మట్టి గణపతులను ప్రదర్శిస్తున్న సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: మట్టి వినాయక విగ్రహాలను కూర్చొబెట్టి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. శనివారం కోడుమూరులో బృందావన్ ఫ్యాన్సీ స్టోర్ యజమాని జనార్దన్ శెట్టి ఏర్పాటు చేసిన ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఏడేళ్లుగా మట్టి విగ్రహాలను జనార్దన్‌శెట్టి ఉచితంగా అందజేస్తుండటం అభినందించదగ్గ విషయమన్నారు. ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ప్రజలంతా ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్, దాత ఎద్దుల మహేశ్వరరెడ్డి, మాజీ ఉపసర్పంచు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


లబ్ధిదారుడికి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- హుసేనాపురంలో కొనసాగుతున్న 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఓర్వకల్లు : రాష్ట్ర ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని హుసేనాపురం-1వ సచివాలయ పరిధిలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగించారు. గడప గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, సంక్షేమ పథకాలు అందాయా? ఎంత మేరకు లబ్ధిపొందారని ఆరాతీశారు. లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా అర్హతగల వారందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామంలో ప్రజలకు ఇబ్బందికరంగా మారిన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటిస్థానంలో కొత్త స్తంభాలు నిర్మించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సర్పంచు చంద్ర గోవర్ధనమ్మ, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, కాల్వబుగ్గ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్ బాషా, పంచాయతీ కార్యదర్శి మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్ర పెద్దస్వామి, జీకే వెంగన్న, గోపా వెంకటరమణా రెడ్డి, రామేశ్వరరెడ్డి, గోపా సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పాలనకు జనం నీరాజనం

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- 40వ వార్డు బాలాజీనగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'


40వ వార్డు బాలాజీనగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నాలుగున్నరేళ్లలో 99.5 శాతం పూర్తి చేయడంతో ప్రతి కుటుంబానికి రూ.50వేల నుంచి రూ.5లక్షలకు పైగా లబ్ధి చేకూరిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తెలిపారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు ఎంతో సంతృప్తితో ఆప్యాయంగా పలకరిస్తూ నీరాజనాలు పలుకుతున్నారన్నారు. శనివారం కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 40వ వార్డు బాలాజీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి, కర్నూలు మండలం వైస్ ఎంపీపీ2 నెహమ్యా, సచివాలయ కన్వీనర్లు ముజమ్మిల్, కరీముల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదోనని ఆరా తీశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మతం, రాజకీయ బేధాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి ఆర్థికంగా ఆదుకుంటున్నారని తెలిపారు. ఆపదలో, నిస్సహాయ స్థితిలో ఉన్న వారందరికీ నేనున్నానంటూ భరోసా కల్పించి సహాయ, సహకారాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ, ఆపదలో ఆదుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే పకడ్బందీగా చేయాలి


మొబైల్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలిస్తున్న రాష్ట్రీయ బాల స్వాస్థ్య మిషన్ అధికారిణి హేమలత

కర్నూలు (న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పకడ్బందీగా ఇంటింటి సర్వే చేయాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటింటి సర్వేలో భాగంగా మొబైల్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వలంటీర్లు ఇంటింటికి తిరిగి సమగ్ర వివరాలు తెలుసుకుని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో పని చేసే సామాజిక ఆరోగ్య అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి సమస్యలున్న వారిని గుర్తించాలని సూచించారు. వైఎస్సార్ ఆరోగ్య పథకం ద్వారా అందించే వైద్య సేవలు ఎలా పొందాలి, ఏ ఆసుపత్రులకు వెళ్లాలి, ఏయే రకాల జబ్బులకు ఏ ఆసుపత్రుల్లో చికిత్స చేస్తారన్న సమాచారాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ

గడివేముల: రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులు పొందిన ఉపాధ్యాయులను శనివారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ–2 విమలా వసుంధరదేవి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గడిగరేవుల జెడ్పీ పాఠశాలలో పని చేస్తున్న సోషల్ స్కూల్ అసిస్టెంట్ దస్తగిరిమ్మ, కరిమద్దెల ఎంపీపీ స్కూల్‌లో పనిచేస్తున్న ఎస్‌జీటీ నిర్మల జ్యోతి రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. అదేవిధంగా బూజునూరు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రవి జిల్లాస్థాయి అవార్డు అందుకున్నారు. వారిని సన్మానించి, విద్యార్థులకు వారు అందించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నగిరి శ్రీనివాసులు, ఓబయ్య, రఫూఫ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గూడూరు: అప్పుల బాధ తాళలేక సి. బెళగల్ మండలం పోలకల్లు గ్రామానికి చెందిన దిన్నే మద్దిలేటి (52) అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇన్ చార్జ్ ఎస్ఐ పీరయ్య తెలిపిన వివరాల మేరకు.. హనుమంతు కుమారుడు మద్దిలేటికి 3 ఎకరాల పొలం ఉంది. వ్యవసాయం కలిసి రాక పోవడం, కుటుంబ పోషణ భారంగా మారడంతో శనివారం గూడూరు కొత్త బస్టాండ్ సమీపంలో మద్యం బాటిల్‌లో పురుగు మందు కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడికి దాదాపు రూ.8 లక్షలు దాకా అప్పులు ఉన్నాయి. ఈమేరకు కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ తెలిపారు. మద్దిలేటికి భార్య, ఓ కుమారుడు ఉన్నారు.

పురుగు మందు తాగి..

కర్నూలు : కుటుంబ సమస్యలతో పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న షేక్ అమీర్ హుసేన్ (36) కోలుకోలేక శుక్రవారం రాత్రి మృతిచెందాడు. కర్నూలు మండలం వెంకాయపల్లె గ్రామానికి చెందిన అతడు పాలిష్ బండల కటింగ్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. 18 ఏళ్ల క్రితం నజీమున్నీసాతో వివాహమైంది. కొన్నాళ్లు సంసారం సాఫీగానే సాగింది. ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తి విడిపోయారు. అయితే లోక్ అదాలత్‌లో ఇరువురు రాజీ అయి కేసు పరిష్కరించుకుని మళ్లీ ఒకటయ్యారు. ఈనెల 14వ తేదీన భార్యాభర్తలు మళ్లీ గొడవ పడ్డారు. ఈక్రమంలో అమీర్ హుసేన్ పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా కోలుకోలేక మృతిచెందాడు. సోదరుడు షేక్ రహిమాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిడ్జూరులో మరొకరు...

కర్నూలు మండలం నిడ్జూరు గ్రామానికి చెందిన బోయ నవీన్ (28) పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈయన వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. ఈనెల 14వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు కనుగొని ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు. కోలుకోలేక శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదుతో కర్నూలు అర్బన్ తాలూకా ఎస్ఐ బాలనరసింహులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు సంతానం.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి 'సురక్ష'


సర్వేను పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.ప్రవీణ్‌కుమార్

కోడుమూరు రూరల్ : ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం కోడుమూరులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఎంపీడీఓ చంద్రశేఖర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎంలు, వలంటీర్లు సర్వే నిర్వహించి ఎవరైనా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే ఏడు రకాల పరీక్షలను నిర్వహించి, వివరాలను యాప్‌లో అప్‌డేట్ చేయడం జరుగుతుందన్నారు. ఈ విధంగా ఎంపిక చేసిన వారికి ఈనెల 30నుంచి ప్రతి గ్రామ సచివాలయంలో జరిగే హెల్త్ క్యాంపులో స్పెషలిస్టు డాక్టర్లచే వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేస్తారన్నారు. అవసరమైతే డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలందిస్తారన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ కో–లోకేటెడ్ వైద్యాధికారి సాయిమోహన్‌రెడ్డి, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, వైద్య సిబ్బంది కమాల్ సాహెబ్, ప్రభావతి, నాగసువర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ కల్పించాలి


నన్నూరు పాఠశాల విద్యార్థులతో డీఈఓ రంగారెడ్డి


ఓజోన్ పొర పరిరక్షించాలని ప్రతిజ్ఞ చేస్తున్న ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు


సి.బెళగల్‌లో ఓ త్రీ ఆకారంలో కూర్చున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

ఓర్వకల్లు: పాఠశాల దశలోనే విద్యార్థులకు పర్యావరణ స్పృహను కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రంగారెడ్డి అన్నారు. మండలంలోని నన్నూరు, ఓర్వకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఇందులో భాగంగా నన్నూరులో హెచ్ఎం ప్రాణేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి డీఈఓతో పాటు, జిల్లా సైన్సు ఆఫీసర్ రంగమ్మ, ఎన్‌జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ మద్దిలేటి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రంగారెడ్డి మాట్లాడుతూ.. ఓజోన్ పొరను రక్షించుకోవడానికి ప్లాస్టిక్ వస్తువులు, ఏసీలు, ఫ్రిడ్జ్‌ల వాడకాన్ని తగించా లని సూచించారు. అంతేగాక కృత్రిమ రసాయనాలతో తయారు చేసిన సబ్బులకు బదులుగా సహజ పదార్థాలతో తయారు చేసిన సబ్బులను వాడాలన్నారు. ఓజోన్ పొర రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు.అనంతరం మొక్కలు నాటే కార్యక్రమా న్ని చేపట్టారు. కార్యక్రమంలో హెచ్ఎం రామచంద్రారెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు భాస్కర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

కల్లూరు: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ప్రాంతీయ పర్యావరణ ఇంజినీర్ బీవై మునిప్రసాద్ అన్నారు. శనివారం ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, నంద్యాల జిల్లా నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చిన్నటేకూరు సమీపంలోని బృందావన్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, వకృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఆయా పోటీలో మంచి నైపుణ్యం ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

ఓజోను పరిరక్షణ ప్రజలందరి బాధ్యత

సి.బెళగల్: ఓజో పొర పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎం మల్లయ్య అన్నారు. శనివారం నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో పాఠశాల ఏకో క్లబ్ సమక్షంలో అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవంను ఎన్‌జీసీ సభ్యులు, సైన్స్ ఉపాధ్యాయులు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల క్రీడా మైదానంలో విద్యార్థులు ఓ త్రీ (ఓజోన్ వాయువు) ఆకారంలో కూర్చొని ఓజో పొర పరిరక్షణకై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుంకన్న, శ్రీనివాసులు, కేశవనాథ్, పద్మనాభయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత

సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీలలో విజేతలకు పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం మల్లయ్య నగదు బహుమతులను అందజేశారు. భారత నిర్దిష్ట ప్రమణాలు అనే అంశంపై బీఐఎస్ క్లబ్ వారు నిర్వహించిన వ్యాసరచన పోటీలో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు రామిరెడ్డి మొదటి స్థానంతో రూ.1,000లు, రెండవ స్థానంతో పృథ్వీనారాయణ రూ.750లను, మూడు, నాల్గవ స్థానాలతో 10వ తరగతి విదార్థులు పెద్దయ్య రూ.500లు, హర్షవర్దన్ రూ.250ల నగదును ఇన్‌చార్జ్ హెచ్ఎం చేతుల మీదుగా అందుకున్నారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం


విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలను సర్పంచ్‌కు అందజేస్తున్న దృశ్యం

గడివేముల: అందరూ మట్టి విగ్రహాలనే పూజించాలని గడిగరేవుల జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం దస్తగిరమ్మ పిలుపునిచ్చారు. శనివారం మండల స్థానిక జెడ్పీస్కూల్‌లో మట్టి విగ్రహాల వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. వినాయకచవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, హానికర రంగులతో తయారు చేసిన విగ్రహాలు ఏర్పాటు చేయడం వల్ల వాతావరణ కాలుష్యం పెరిగిపోతుందని, తద్వారా ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారన్నారు. వినాయచవితికి ప్రతి ఇంట్లో మట్టి విగ్రహాలలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలను గ్రామ సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి, పీఎంసీ చైర్మన్ శ్రీనివాసులకు అందజేశారు. అంతకుముందు గ్రామంలోని ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే బూజునూరు ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. మట్టి విగ్రహాలను తయారీలో ప్రతిభ చూపిన విద్యార్థులు హెచ్ఎం రవి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిశ్వకర్మ జయంతిని జయప్రదం చేయండి

కోడుమూరు రూరల్: స్థానిక శ్రీకాళికాదేవి ఆలయంలో ఆదివారం శ్రీమద్విరాట్ విశ్వకర్మ జయంతిని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరశేఖర్ ఆచారి తెలిపారు. శనివారం ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆలయంలో కమిటీ సభ్యులు విడుదల చేశారు. అనంతరం వీరశేఖర్ ఆచారి మాట్లాడుతూ జయంతి మహోత్సవంలో భాగంగా ఉదయం ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, శ్రీవిశ్వకర్మ పతాకావిష్కరణ, పూజలనంతరం మధ్యాహ్నం దాత క్రిష్టాపురం నాగేంద్ర ఆచారి, రమణయ్య, బ్రహ్మయ్య, రామక్రిష్ణల సహకారంతో అన్నదానం నిర్వహిస్తామన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం

పాణ్యం: మండల పరిధిలోని కొణిదేడు గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌బాషా(33) శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. పాలిష్ కట్టర్‌గా పనిచేస్తున్న మహబూబ్‌బాషా తన ఇంటి నిర్మాణంలో భాగంగా కిటీకీలకు సంబంధించిన కడ్డీలను మిషన్‌తో కోస్తున్నాడు. మిషన్ నుంచి కడ్డీలకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అచేతనంగా పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు, కూలీలు వెంటనే శాంతిరాం ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఖాసీంబీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి


బురాన్‌దొడ్డిలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

సి.బెళగల్: ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన ఈఓఆర్డీ సందీప్, మండల హౌసింగ్ ఏఈ సుమంత్, సిబ్బందితో కలిసి బురాన్‌దొడ్డి గ్రామంలో పర్యటించారు. అక్కడ జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన లబ్ధిదారులకు గృహ నిర్మాణాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కాగా గ్రామంలో 47 మంది లబ్ధిదారులు ఉండగా, ప్రారంభదశలో 17, రూఫ్ లెవల్ 8, పూర్తి అయినవి 22 ఉన్నాయని ఏఈ తెలిపారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంట ఇంజినీర్ అసిస్టెంట్ శాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్న, లబ్ధిదారులు ఉన్నారు.